సీఎం జగన్‌తోనే సొంతింటి కల సాకారం


లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల పట్టాలు, తాళాలు అందిస్తున్న సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, జీవీఎంసీ అధికారులు


ముత్యమాంబ కాలనీలో లబ్ధిదారులకు కేటాయించిన టిడ్కో ఇళ్లు

- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్
- వేడుకగా 192 టిడ్కో గృహాల ప్రారంభోత్సవం
- లబ్ధిదారులకు పట్టాలు, తాళాల పంపిణీ

కంచరపాలెం: ప్రతి పేదవాడి సొంతింటి కల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సాకారమవుతుందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం దయానందనగర్ పరిధి ముత్యమాంబ కాలనీలో గురువారం టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. టిడ్కో గృహాలను, వాటి పట్టాల పంపిణీ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం సుమారు 192 టిడ్కో ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు, తాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ పేదల పక్షపాతని కొనియాడారు. ఇల్లు రాలేని అర్హులకు కూడా భవిష్యత్తులో వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రజలకు హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ సీఎంగా గెలిపించుకుంటే కాలనీలను మరింత అభివృద్ధి చేసుకునేందుకు వీలవుతుందన్నారు. గత ప్రభుత్వంలో డీడీలు కట్టి టిడ్కో ఇల్లు రాని వారికి నగదు మొత్తాన్ని తిరిగి డీడీల రూపంలో ఆడారి ఆనంద్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, 56వ వార్డు కార్పొరేటర్ రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీను, 57వ వార్డు కార్పొరేటర్ ముర్రు వాణి, పీడీ పాపునాయుడు, ఏపీడీలు చిరంజీవి, పద్మావతి, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, వలంటీర్లు, ఆర్పీలు, గృహసారథులు, కార్యకర్తలు, ఆయా కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సుకే సంక్షేమ పథకాలు


60వ వార్డు ప్రజలతో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: అధికారం కోసం తహతహలాడుతున్న టీడీపీ, జనసేన పార్టీలు తమ పబ్బం గడుపుకోవడానికే ప్రాధాన్యమిస్తాయని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ విమర్శించారు. 60వ వార్డు పవన్‌పుత్రకాలనీ సచివాలయం పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన సంక్షేమ పథకాల కరపత్రాలను లబ్ధిదారులకు అందజేసి మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సుకు అనేక సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. టీడీపీ, జనసేనలకు ప్రజా సంక్షేమం కంటే స్వలాభమే ముఖ్యమన్నారు. టీడీపీ పాలనలో ప్రజల బాగోగులు గాలికి వదిలేసి, నేడు అదే ప్రజలపై కపట ప్రేమ చూపుతూ తమకు అధికారం కట్టబెడితే మేలు చేస్తామని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిరంతరం ప్రజల కోసం తపిస్తున్న సీఎం జగన్‌కు ప్రజలంతా మరోసారి అవకాశం ఇవ్వాలన్నారు. కరోనా వంటి కష్టకాలంలో కూడా ఎక్కడా సంక్షేమాన్ని విస్మరించకుండా సీఎం ప్రజలకు మేలు చేశారని గుర్తుచేశారు. స్థానిక నాయకుడు జి.ఎల్.వి.నరేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రినాథ్, మాజీ కార్పొరేటర్ పిల్లా కన్నబాబు, గ ల్లా శ్రీను, నాయకులు ఆడారి హరీష్, అంగ రామ్‌ప్రసాద్, మళ్ల ధనలత, త్రినాథ్, హనుమంతరావు, నమ్మి శ్రీను, కామాక్షి, మనోహర్, శివలక్ష్మి, ఉమామహేశ్వరి, సత్తిబాబు, గుంట సుందర్‌రావు పాల్గొన్నారు.

మణిపూర్ మారణహోమానికి కేంద్రమే బాధ్యత వహించాలి

గోపాలపట్నం : మణిపూర్‌లో జరుగుతున్న మారణహోమానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సోడదాసు సుధాకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లపై వెంటనే చర్యలు తీసుకుని ఉంటే ఇంత దారుణమైన పరిస్థితి ఉత్పన్నమయ్యేది కాదన్నారు. ఇద్దరు మహిళల పట్ల ఇంత అమానుషంగా వ్యవహరించడం చాలా బాధాకరమన్నారు. మహిళల్ని అర్ధనగ్నంగా ఊరేగించడం దారుణమన్నారు. ఈ ఘటన ప్రపంచాన్నే దిగ్భ్రాంతికి గురిచేసిందని వాపోయారు. ఈ అల్లర్లపై ప్రధాని చొరవ చూపకపోవడం, కనీసం ఒక ప్రకటన కూడా చేయకపోవడం దారుణమన్నారు. ఈ అల్లర్లలో 150 మంది పౌరులు మృత్యువాత పడ్డారని వాపోయారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు నెలకొల్పేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్పొరేటర్ పీవీ సురేష్‌కు పితృవియోగం


సురేష్ తండ్రి సత్యనారాయణ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్‌కు పితృవియోగం కలిగింది. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న సురేష్ తండ్రి సత్యనారాయణ గురువారం సాయంత్రం మృతి చెందారు. ఆయన భౌతిక కాయానికి వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏ మాత్రం అధైర్య పడవద్దని, అండరం తోడుగా ఉంటామని పీవీ సురేష్‌కు ధైర్యం చెప్పారు. సత్యనారాయణ మృతికి పలువురు ప్రముఖులు, పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

ఎంఈవోలకు సత్కారం


ఎంఈవోలను సత్కరిస్తున్న శ్రీహరిపురం జీవీఎంసీ పాఠశాల ఉపాధ్యాయులు

మల్కాపురం: ములగాడ మండలం విద్యా అధికారులు త్రినాథ్‌మూర్తి(ఎంఈవో–1), కె.వెంకటరావు(ఎంఈవో–2)లను శ్రీహరిపురం జీవీఎంసీ పాఠశాల యాజమాన్యం గురువారం ఘనంగా సత్కరించింది. 58వ శ్రీహరిపురం జీవీఎంసీ హైస్కూల్‌లో ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ములగాడ మండల పరిధిలో ఇటీవల కొత్తగా నియమితులైన వీరిని పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధులు శాలువాతో సత్కరించి అభినందించారు.

పారదర్శకంగా ఓటర్ల సర్వే


బీఎల్‌వోలు, సచివాలయ కార్యదర్శులకు సూచనలిస్తున్న జెడ్సీ మల్లయ్య నాయుడు

గోపాలపట్నం: జీవీఎంసీ 91, 92 వార్డుల్లోని లక్ష్మీనగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో జోన్–8 కమిషనర్ మల్లయ్య నాయుడు ఆధ్వర్యంలో గురువారం ఓటర్ల జాబితాల తనిఖీలు నిర్వహించారు. ఓటు హక్కు కలిగిన కుటుంబాలు ఆయా చిరునామాల్లో నివసిస్తున్నారా లేదా అన్న అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ తనిఖీలు అవకతవకలు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని బీఎల్‌వోలు, సచివాలయం కార్యదర్శులకు సూచించారు. ఓటర్ జాబితా ప్రకారం ప్రతి ఇంటికీ వెళ్లి పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శులు బండారు శ్రీనివాసరావు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తులపై యువకుడి దాడి

మల్కాపురం: మద్యం తాగి ఉన్న ఓ యువకుడు ఇద్దరు వ్యక్తులపై దాడి చేశాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మల్కాపురం కృష్ణ బార్ అండ్ రెస్టారెంట్‌లో పనిచేస్తున్న నాయుడు, సత్యనారాయణ అనే ఇద్దరు వ్యక్తులు గురువారం రాత్రి తమ విధులు ముగించుకుని శ్రీహరిపురం గణేష్ మందరిం వైపు నడుచుకుని వెళ్తున్నారు. ఆ సమయంలో అక్కడ మద్యం తాగి ఉన్న ఓ యువకుడు వీరిపై దాడి చేశాడు. ఆ యువకుడు ఎవరో తమకు తెలియదని, ఎందుకు దాడి చేశాడో అర్థం కావడం లేదని బాధితులు వాపోయారు. ఈ ఘటనపై మల్కాపురం పోలీసులను ఆశ్రయిస్తామన్నారు.

నేటి నుంచి గరికిపాటి ప్రవచనాలు

సీతమ్మధార: క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23 వరకు మహా సహస్రావధాని గరికిపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. సీతమ్మధారలోని క్షత్రియ కల్యాణ మండపంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, భక్తులు తరలి రావాలని వారు కోరారు.

అప్పన్నకు నిత్య కల్యాణం


తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలను అందజేశారు.

ఎంపీ కరీం, తపన్‌సేన్‌ల దృష్టికి షిప్‌యార్డ్ సమస్యలు


ఎంపీ కరీంకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

సింధియా: రాజ్యసభ సభ్యుడు ఎలమరం కరీం, సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్‌ను గురువారం షిప్‌యార్డ్ సీఐటీయూ అధ్యక్షుడు బి.ఎస్.ఎన్.రాజు, ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రసాద్ కలిశారు. షిప్‌యార్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వారికి వినతిపత్రం అందజేశారు. ముందుగా ఎంపీ కరీంను కలిసి షిప్‌యార్డ్‌కు వర్క్ ఆర్డర్స్‌లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, సంస్థను నమ్ముకుని కొన్నేళ్లుగా పనిచేస్తున్న ఎల్ అండ్ ఎం సిరీస్ కార్మికులను రెగ్యులర్ చేసేలా చూడాలని, ఫ్రెష్ ఫైనాన్షియల్ రీ స్ట్రక్చర్(ఎఫ్ఎఫ్ఆర్)లపై వినతిపత్రాలను అందించారు. అనంతరం తపన్‌సేన్‌కు ఇదే సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన వారు ఈ సమస్యలను కేంద్ర రక్షణ మంత్రి రాజనాథ్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లి కార్మికులకు న్యాయం జరిగేలా చొరవ చూపుతామని హామీ ఇచ్చినట్టు యూనియన్ ప్రతినిధులు తెలిపారు. వీరితోపాటు పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ కో కన్వీనర్ కె.కుమార్‌మంగళం ఉన్నారు.

బల్ల లక్ష్మణరావుకు ఘన సత్కారం


బల్ల లక్ష్మణరావును అభినందిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలో సభ్యుడిగా ఎన్నికైన 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావును గురువారం 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఘనంగా సత్కరించారు. పలువురు నాయకులు, కార్యకర్తలతో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు సాధించి, ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.

రాజభాష అమలుకు హెచ్‌పీసీఎల్ కృషి


జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హెచ్‌పీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ రతన్‌రాజ్

అల్లిపురం : రాజభాష అమలుకు హెచ్‌పీసీఎల్ కృషి చేస్తోందని కంపెనీ చీఫ్ జనరల్ మేనేజర్ వి.రతన్‌రాజ్ తెలిపారు. విశాఖ రిఫైనరీ ఆధ్వర్యంలో అధికార బాషా వార్షిక సదస్సు 2023 గురువారం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్ రిఫైనరీలో రాజభాషను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్, విశాఖ రిఫైనరీ హెచ్ఆర్ జి.కిరణ్‌కుమార్, జనరల్ మేనేజర్ లాలన్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

వీసీకి సిరిధాన్యాల చిత్రపటం బహూకరణ


ఏయూ వీసీ ప్రసాదరెడ్డికి సిరిధాన్యాల చిత్రపటం బహూకరిస్తున్న విజయ్‌కుమార్

ఏయూక్యాంపస్: సిరిధాన్యాలతో తీర్చిదిద్దిన చిత్రపటాన్ని ఏయూ వీసీ ఆచార్య ప్రసాద రెడ్డికి నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ బహూకరించారు. గురువారం వీసీ ప్రసాద రెడ్డిని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి చిత్రపటాన్ని అందజేశారు. 2023 సంవత్సరాన్ని యుఎన్ అంతర్జాతీయ సిరిధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. దీనిని విస్తృతంగా ప్రజల్లోనికి తీసుకువెళ్లడానికి, చిత్రకళను మాధ్యమంగా ఉపయోగించి ప్రముఖుల చిత్రపటాలను తీర్చిదిద్దడం జరుగుతోందని విజయ్ కుమార్ తెలిపారు. సిరిధాన్యాలను ఉపయోగించి చిత్రపటాలలను తయారు చేయడాన్ని వీసీ ప్రసాద రెడ్డి ప్రశంసించారు.

నైపుణ్యాల వృద్ధితోనే రాణింపు


ప్రసంగిస్తున్న శ్రీనివాస్

ఏయూక్యాంపస్: మార్కెట్ అవసరాలకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను వృద్ధి చేసుకోవాలని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా సభ్యులు ఎన్.శ్రీనివాస్ అన్నారు. గురువారం ఏయూ కామర్స్‌మేనేజ్‌మెంట్ విభాగంలో 'కెరియర్ ఆపర్చునిటీస్ ఇన్ ఫైనాన్స్' అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ బహుళ నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని తెలియజేశారు. కాలానుగుణంగా వస్తున్న మార్పులు, నూతన అంశాలను ఆకళింపు చేసుకోవడం, అవగాహన పొందడంలో అనుసరించాల్సిన విధానాలను వివరించారు. పన్ను విధానం తరచూ మార్పులు చెందుతున్నాయని, వీటిపై లోతైన అవగాహన అవసరమన్నారు. ప్రతీ విద్యార్థి సమానంతగా మరొక ఉన్నత విద్య కోర్సును అభ్యసించే ప్రయత్నం చేయాలని సూచించారు. అదే విధంగా కంప్యూటర్ పరిజ్ఞానం, టాలీ వంటి వాణిజ్యపరమైన సాఫ్ట్‌వేర్‌లను నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, డాక్టర్ ఏ.ప్రభాకర్, డాక్టర్ బి.సుబ్బయ్య, పరిశోధకులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ప్రధాన వక్త శ్రీనివాస్‌ను సత్కరించారు.

900 రోజులకు చేరువలో ఉక్కు ఉద్యమం

- పౌరగ్రంథాలయంలో మేధావుల సదస్సు నేడు
- 'సేవ్ వైజాగ్ స్టీల్' పాదయాత్ర రేపు
- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు వెల్లడి


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

కూర్మన్నపాలెం: ఉక్కు పరిరక్షణ ఉద్యమం 900 రోజులకు చేరువవుతున్న తరుణంలో పలు కార్యక్రమాలు చేపట్టనున్నామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 889వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి పౌరగ్రంథాలయంలో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై మేధావుల సదస్సును నిర్వహించనున్నట్లు చెప్పారు. జాతీయ జెండా ఆవిష్కరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 22వ తేదీ శనివారం ఉదయం 8 గంటలకు హిందుస్థాన్ జింక్ గేటు నుంచి కూర్మన్నపాలెం వరకు సేవ్ వైజాగ్ స్టీల్ పేరుతో పాదయాత్రను నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ నెల 30వ తేదీ ఆదివారం ఉదయం 7.30 గంటల నుంచి 10 గంటల వరకు ఉక్కు నిర్వాసిత కాలనీలైన అగనంపూడి, వడ్లపూడి, గంట్యాడ, ఉక్కునగరం, కూర్మన్నపాలెం, గంగవరం తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. ఉక్కు ఉద్యమం 900 రోజులకు చేరుకున్న సందర్భంగా ఈ నెల 31వ తేదీ సోమవారం సాయంత్రం 4 గంటలకు కూర్మన్నపాలెంలోని దీక్ష శిబిరం వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలియజేస్తామని, కార్మికులు, నిర్వాసితులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ సర్వేక్షణ్'పై అవగాహన

సీతంపేట: స్వచ్ఛ సర్వేక్షణ్ 2023పై అవగాహన కార్యక్రమాలను జీవీఎంసీ యంత్రాంగం విస్తృతం చేసింది. దీనిలో భాగంగా గురువారం వై.కె.రాజు కళా బృందంచే నరసింహనగర్ రైతుబజార్‌లో ప్రదర్శన నిర్వహించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో నగరానికి మెరుగైన ర్యాంకు సాధనకు విశాఖ పౌరుల పాత్రపై వీధి నాటిక ద్వారా అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ నిషేధం, తడి, పొడి, హానికర చెత్త వేర్వేరుగా పారిశుధ్య సిబ్బందికి అందజేయడం, పరిసరాల పరిశుభ్రత, ఎకో వైజాగ్ వంటి అంశాలపై వీధి నాటిక, జానపద గీతాలతో వినియోగదారులకు, రైతులకు వివరించారు. 51, 49 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జీవీఎంసీ సహాయ వైద్యాధికారి సునీల్ మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యాగులు విడనాడి గుడ్డ సంచులు వాడాలని సూచించారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు


సత్తి సునీల్‌రెడ్డితో బహుమతులు పొందిన విద్యార్థులు

మురళీనగర్: విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో నైపుణ్యాభివృద్ధి సాధించినప్పుడే ఉన్నత అవకాశాలు లభిస్తాయని కేంద్ర సీబీడీ సంస్థ రిటైర్డ్ ఎస్పీ సత్తి సునీల్‌రెడ్డి అన్నారు. ఏఎస్సార్ నగర్‌లోని కె.కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆయన గురువారం వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవన నైపుణ్యాలు పెంపొందించుకోవడంతోపాటు క్రమశిక్షణ, సమయపాలన పాటించాలన్నారు. ఉత్తమ పుస్తకాలు చదవడం ద్వారా నైతిక విలువలు పెంపొందించుకోవచ్చని ఉదాహరణలతో వివరించారు. విద్యార్థులను వివిధ అంశాలపై ప్రశ్నలు అడిగి ఉత్తమ సమాధానాలు చెప్పిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

మద్దిలపాలెం: ఏపీఎస్ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వాల్తేరు డిపోలో మెగా సామూహిక రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రీజినల్ కార్యదర్శి బి.నీలకంఠం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీఎస్ఆర్టీసీ వీసీ, ఎండీ సిహెచ్.ద్వారకా తిరుమలరావు హాజరుకానున్నారన్నారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు సారథ్యంలో జరగనున్న మెడికల్ క్యాంప్‌లో ఉద్యోగులు, కార్మికులు, గ్యారేజ్ ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సీజనల్ వ్యాధులపై దృష్టి

ఆరిలోవ: మలేరియా నివారణపై పట్టణ ఆరోగ్య కేంద్రాలలో పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి ఎం.తులసి తెలిపారు. ఆరిలోవ ప్రాంతంలో బాలాజీనగర్, ఆరిలోవ కాలనీలలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఆమె గురువారం సందర్శించారు. ఆయా ఆస్పత్రులలో ల్యాబరేటరీలు తనిఖీ చేశారు. లాబరేటరీలలో వినియోగిస్తున్న పరికరాలు, మలేరియా, డెంగ్యూ పరీక్షలలో నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మలేరియా, డెంగ్యూ తీవ్రత ఎక్కువగా ఉందన్నారు. వాటి నివారణ దిశగా సిబ్బంది పనిచేయాలన్నారు. దీని కోసం ప్రణాళికాబద్ధమైన నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం డ్రైడే–ఫ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఇంటింటికి వెళ్లి లార్వాను గుర్తించాలన్నారు. ప్రస్తుతం ఇంటింటికీ ఫీవర్ సర్వే వేగవంతం చేయాలని సూచించారు. వలంటీర్లకు ఆశా వర్కర్లు సహకరించాలన్నారు. ఈ పర్యటనలో మలేరియా విభాగం అధికారి నగేష్, పలువురు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన


సహస్ర తులసీదళార్చనలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన సిరులతల్లి కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీదళార్చన ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజతోపాటు పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రా నవవర్ణార్చన లక్ష్మీ హోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో రుసుం చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ
కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించనున్నారు.

రూ.33 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం


శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 87వ వార్డు వడ్లపూడిలో రూ.13.03 లక్షలతో చేపట్టనున్న నీటి సరఫరా పనులు, సిద్ధార్థ నగర్‌లోని పంపుహౌస్ వద్ద రూ.19.98 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపడుతున్నామన్నారు. సమస్యలను సత్వరం పరిష్కరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, బొడ్డ గొవింద్, ప్రగడ వేణుబాబు, కోమటి రమాదేవి, దుగ్గపు దానప్పలు, బలిరెడ్డి నాగేశ్వరరావు, జెర్రిపోతుల ఈశ్వరరావు, ఆడారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీలో పెన్షనర్ల సమావేశం

ఎంవీపీకాలనీ: జిల్లా సంక్షేమ శాఖల పూర్వ ఉద్యోగుల పెన్షనర్ల సంఘం సమావేశం గురువారం ఎంవీపీ కాలనీ సాంఘిక సంక్షేమ శాఖ సమావేశ మందిరంలో జరిగింది. పెద్ద ఎత్తున సభ్యులు హాజరై పలు అంశాలపై చర్చించారు. పెన్షన్ పొందే క్రమంలో ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై అభిప్రాయాలను వెల్లడించారు. ప్రతి నెలా పెన్షన్ సకాలంలో బ్యాంకు ఖాతాలో జమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఈ దిశగా సంఘ ప్రతినిధులు చొరవ చూపాలని సంఘ అధ్యక్షుడు నాగేశ్వరరావును కోరారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన పింఛన్‌దారులు వారి వారి సమస్యలను సంఘ ప్రతినిధులకు వివరించారు.